క్లుప్తంగా

పోలీసుల అదుపులో యువకుడు



కడ్తాల్: మండలంలోని మైసిగండి ఆలయ సమీపంలో మంగళవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుర్తుతెలియని యువకుడు(26) పోలీసులకు కనిపించాడు. యువకుడిని విచారించగా అతను మూగ, చెవిటి వాడని తెలిసింది. మెదక్ జిల్లాకు చెందిన వాడని స్థానికులు చెప్పడంతో వెంటనే మెదక్ పోలీస్ కంట్రోలు రూంకు సమాచారం ఇచ్చారు. ఎవరికైనా యువకుడికి సంబంధించిన వివరాలు తెలిసి ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ శివప్రసాద్ కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేసిన జెడ్పీటీసీ

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామానికి చెందిన శంకరయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని స్థానిక జెడ్పీటీసీ. రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, రైతుబంధు జిల్లా సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ గోపాల్, సర్పంచ్‌లు లక్ష్మీ నర్సింహరెడ్డి,యాదయ్య, ఉప సర్పంచ్ వినోద్ ఉన్నారు.

బీజేపీతోనే దేశ భవిష్యత్తు

పార్టీ అభ్యర్థి శ్రీరాములు యాదవ్



బీజేపీలో చేరిన యువకులు

కందుకూరు: మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని తిమ్మాపూర్, జైత్వారం, దెబ్బడగూడ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం అందెల సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. బీజేపీతోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రమేష్, భిక్షపతి పాల్గొన్నారు.

వలస నేతలను ఓడించాలి

మహేశ్వరం: బీజేపీ మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ గెలుపు ఖాయమని ఆ పార్టీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న సబితారెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిలు వలస నేతలన్నారు. చేవెళ్ల నుంచి మహేశ్వరానికి వలస వచ్చి పోటీ చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన ప్రజావ్యతిరేక విధానాలే తమని గెలిపిస్తాయన్నారు. బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాధవచారి, నాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం ముఖ్యం

బడంగ్‌పేట్: గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో పల్లవి మోడల్ స్కూల్ బోడుప్పల్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా డీజీ జ్ఞాన్ కార్యక్రమం నిర్వహించింది. దీనికి కంప్యూటర్‌లో దిగ్గజాలైన మానసరెడ్డి, నఫీసా అంజు హాజరయ్యారు. బోడుప్పల్ పరిసర ప్రాంతాల్లోని 11 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఎంపిక చేసుకుని అందులో 820 మంది విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చారు. పది రోజుల పాటు తర్ఫీదును అందించి ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులు మాట్లాడుతూ.. డీజీ జ్ఞాన తరగతులలో సైబర్ నేరాలు అరికట్టడం, ఎంఎస్ ఆఫీస్ ఉపయోగాలు తెలుసుకున్నామన్నారు. రాష్ట్ర సమాచార ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, వీహబ్ సీఈఓ దీప్తి రావుల, కోఆర్డినేటర్ తాజ్, పల్లవి గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య, డైరెక్టర్లు సుధ, సుశీల్, ప్రిన్సిపాల్ తనూజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన



తలకొండపల్లి: ప్రచారంలో మాట్లాడుతున్న కసిరెడ్డి తదితరులు



చంద్రాయణపల్లిలో ప్రచారం చేస్తున్న కరుణశ్రీ



మాడ్గుల: ఇంటింటి ప్రచారం చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

- కల్వకుర్తిలో విద్యావ్యవస్థను పటిష్టం చేస్తా
- ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తా
- కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో సంక్షేమం ఏర్పడి బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ కల్వకుర్తి అభ్యర్థి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించి, నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని మెదక్‌పల్లి, చౌదర్‌పల్లి, మాదాయిపల్లి, ఇస్రాయిపల్లి, జూలపల్లి, అంతారం, వెల్జాల్ గ్రామాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితో కలిసి కసిరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అధికారంలోకి రాగానే రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. చౌదర్‌పల్లి–సంఘాయిపల్లి వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజల బాధలు తీరుస్తానని భరోసా కల్పించారు. అధికారంలోకి వచ్చిన తక్షణమే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని వివరించారు. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కల్వకుర్తి నియోజవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరథం, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ప్రదిప్‌రెడ్డి, ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసామూర్తి, అర్జున్‌రెడ్డి, రాష్ట్ర గిరిజన సేవా సంఘం కార్యదర్శి హన్మ నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా ఉన్నారు.



కడ్తాల్: స్కీంల గురించి వివరిస్తున్న నేతలు

కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ అన్నారు. కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిని గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయణపల్లి తండా, విఠాయిపల్లిలో కసిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు జంగయ్య, కేశవులు, స్థానిక నాయకులు కృష్ణనాయక్, ఖాదర్, శివలింగం, అలీం, శ్రీకాంత్, నాజర్, ఫరీద్, ఖరీం, మహేశ్, బాబా పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే తండాల అభివృద్ధి

మాడ్గుల: మండలంలోని ఫకిర తండా గ్రామ పంచాయతీలో ఆరు గ్యారంటీ హామీలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందిరమ్మ రాజ్యంతోనే తండాల అభివృద్ధి జరిగిందని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిఅన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయమాటలో ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. నియంతపాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డిని భారీ మెజార్టీతో గెలపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మారెడ్డి, సర్పంచ్ యాచారం వేంకటేశ్వర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, దళపతిగౌడ్, నాయకులు రవి, చందు, రాంజ, అమ్రు, రాజేందర్, సతీష్ పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు
డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తుందని, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా మండల కేంద్రంలోని పలు కాలనీల్లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అసమర్థ పాలన సాగిస్తోందని, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుక్కుగూడ విజయభేరి సభలో సోనియాగాంధీ ప్రకటించిన విధంగా అధికారంలోకి రాగానే గ్యారంటీ కార్డును అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జహంగీర్‌అలీ, చందోజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, ఎస్సీసెల్ అధ్యక్షుడు అశోక్, ఇక్బాల్, లక్ష్మయ్య రాజేందర్ ఉన్నారు.

పోలింగ్ నిర్వహణ తీరుతెన్నుల పరిశీలన

కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలన చేయాలని మైక్రో అబ్జర్వర్లకు జనరల్ అబ్జర్వర్లు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి , జనరల్ అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు హాజరైన జనరల్ అబ్జర్వర్లు ఆర్‌ఎస్ వినమ, శిల్పా గుప్తా, చంద్రకాంత్ కృష్ణారావు డాంగే, రామ్‌కుమార్, తైతులంగ్ పమేయలు మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న ఎనిమిది నియోజకవర్గాలకు శాసనసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కల్గి ఉండాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు ఉ.7 గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని సిబ్బందికి సామగ్రి అందిందా లేదా చూసుకోవాలని చెప్పారు. సిబ్బందితో పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు ఉన్నాయా లేవా చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని గమనించాలని ఆదేశించారు. ప్రతి పార్టీ తరపున ఇద్దరు ఏజెంట్లను నియమించనుండగా పోలింగ్ కేంద్రాల్లోకి ఒక్కరికి మాత్రమే అనుమతించాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు కలిగిన వారు మినహా ఇతరులను లోపలికి అనుమతించరాదన్నారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



మైక్రో అబ్జర్వర్లకు శిక్షణఇస్తున్న జనరల్ అబ్జర్వర్లు

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి



హయత్‌నగర్: తొర్రూర్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంచిరెడ్డి



యాచారం: మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న మౌనిక

ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

హయత్‌నగర్: నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి అవకాశం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలను విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రచారంలో భాగంగా ఆయన తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మన్నెగూడ, రాగన్నగూడ, ఇంజాపూర్, మునుగనూరు, తొర్రూరు, బ్రాహ్మణపల్లిల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని ప్రతి కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దళితబంధు, బీసీబంధు పథకాలను అందింయాామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆయా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే ఆసరా పింఛన్లు ఐదువేలకు, రైతుబంధు పదహారు వేలకు పెంచుతామన్నారు. రూ. 400కే గ్యాస్ బండ అందిస్తామని, ప్రతి ఒక్కరికి 10 లక్షల బీమా చేస్తామని, రైతుకూలీలకు కూడా బీమా సౌకర్యం కల్పిస్తామని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం మరోసారి అంధకారంలోకి వెళ్తోందన్నారు. కారు గుర్తుకు ఓటేసి మరోసారి అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు క్యామ మల్లేశ్, వంగేటి లక్ష్మారెడ్డి, కొత్తకూర్మ సత్తయ్య, బల్‌దేవ్ రెడ్డి, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

మామను గెలిపిస్తే మంత్రవుతాడు..

యాచారం: మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అంటేనే మంచితనం...కారు గుర్తుకు ఓటేసి నాలుగోసారి గెలిపిస్తే మామ మంత్రివుతాడు... కారు గుర్తును మర్చిపోవద్దు అంటూ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోడలు మౌనిక ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని నస్దిక్‌సింగారం గ్రామంలో మంగళవారం ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు.



ఇబ్రహీంపట్నం: తుర్కగూడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న శీతల్

డాడీని గెలిపించండి
అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కుతూరు శీతల్

ఇబ్రహీంపట్నం: డాడీని గెలిపించండి... నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాడని బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కుతూరు శీతల్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి మంగళవారం తుర్కగూడలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శీతల్ మాట్లాడుతూ.. మంచికి మారు పేరు గాంచిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. గతంలో ఎన్నాడు జరగని విధంగా ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కిషన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల పవిత్రకుమార్, మార్కెట్ డైరెక్టర్ ఏనుగు బుచ్చిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ మంగ

ఆసరా ఇస్తున్న కేసీఆర్‌కే మన ఓటు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆసరా పెన్షన్ ఇస్తున్న కేసీఆర్ సార్‌కే ఓటు వేయాలని పోల్కంపల్లి ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ కోరారు. మంగళవారం మండలంలోని పోల్కంపల్లి అనుబంధ గ్రామం మన్నెగూడ ,జాజోనిబావిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులను కలిసి ఓటు అడిగారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, రవీందర్, రాజు, మల్లేశ్, సామయ్య, నర్సింహాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పాలనను అంతం చేద్దాం

ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: బీఆర్‌ఎస్ అవినీతి పాలనను అంతం చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నోముల, లింగంపల్లి, మంచాల, చిత్తాపూర్, తాళ్లపల్లిగూడ, తిప్పాయిగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అభివృద్ధి పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందన్నారు. సామాన్యలకు బీఆర్‌ఎస్ పాలనలో ఒరిగింది ఏమీ లేదన్నారు. పెద్ద ఎత్తున భూ అక్రమాలకు పాల్పడారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే బలహీన వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. నేడు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. 24 గంటలు కరెంట్ సరఫరా పేరుతో వేలకు వేలు కరెంట్ బిల్లులు ప్రజలపై భారం మోపుతుందన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో పేదోడి సొంత ఇంటి కలను నెరవేర్చలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసి గ్రామాల రూపురేఖలు మార్చడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. కంపెనీల పేరుతో భూములు లాక్కొన్న దొంగలను గ్రామాల్లోకి రానివొద్దని సూచించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండమోని జయమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మహిపాల్, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, మర్రి నిరంజన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లేష్, ప్రేమాకర్‌రెడ్డి, హన్మంత్ రెడ్డి, శ్రీధర్, సీహెచ్ సంజీవ, మల్లేష్, సీపీఐ నాయకులు నర్సింహ, నీలమ్మ, శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నరేందర్‌రెడ్డి, జయనందం, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: రంగారెడ్డికి కుంకుమ తిలకం పెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

అంకితభావంతో సేవ చేస్తా

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించండి.. అంకితభావంతో సేవ చేస్తానని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపేటలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. నగరానికి సమీపంలో ఉన్న నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ అవినీతి, అక్రమాలను అరికట్టాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. సీతారాంపేట గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. భారీ మెజార్టీతో గెలిపించాలని మల్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ తిలకం దిద్దిగా, యువకులు ఎంతో ఉత్సాహంగా మల్‌రెడ్డిని గ్రామానికి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి, మాజీ సర్పంచ్ బూడిద నర్సింహ్మారెడ్డి, పార్టీ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, సింహారెడ్డి, కమలకర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మంచాల: అభివాదం చేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

మలుపులున్నాయి... జర జాగ్రత్త



చరికొండ గ్రామ సమీపంలో ప్రమాదకర మలుపు



ముద్విన్ సమీపంలో సూచిక లేని మలుపు

సూచికలు లేని మలుపులతో తరుచూ ప్రమాదాలు

కడ్తాల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రమాదకర మలుపులతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మూల మలుపుల వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనచోదకులు తరుచు రోడ్డు ప్రమాదాల బారిన పడుతూ గాయాలయిన ఘటనలు, మృత్యువాత పడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. పెద్ద ప్రమాదాలు జరగక ముందే సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టి, సూచిక బోర్డులతో పాటు, ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మాడ్గుల: చదువుతో పాటు విద్యార్థులు క్రీడలపై దృష్టి సారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అమెరికా తెలుగు అసోసియేషన్ సభ్యులు తెహ్మినాఖాన్ అన్నారు. మండలంలోని ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవ్ ఎన్విరాన్మెంట్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెహ్మినాఖాన్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. క్రీడలతో శారీరకదారుఢ్యం, మానసికోల్లాసం కలుగుతోందని అన్నారు. అలాగే, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సర్ధార్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వతాలు, మాజీ హెచ్‌ఎం విజయ భాస్కర్‌రెడ్డి ఉపాధ్యాయులు ముత్యపు రెడ్డి, పీఈటీ వేంకటేశ్వర్లు రాజు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న తెహ్మినా ఖాన్, ఉపాధ్యాయులు